క్లుప్తంగా

నూతన కార్యవర్గం నియామకం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కృష్ణ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కోలా బంగారయ్య, ఉపాధ్యక్షులుగా ఒమ్మి వెంకటి, ఒమ్మి సిమ్మినాయుడుతో పాటు మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారంతా పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త కార్యవర్గ సభ్యులను ఆమె అభినందించారు. కమిటీ సభ్యులంతా కలసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపకార' కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఆరిలోవ: ఉపకార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీలో ఉపకార కప్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచెర్ల అచ్యుతరావు, సినీ హీరో కంచెర్ల ఉపేంద్ర ప్రారంభించారు. తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు నుంచి 16 జట్లు పోటీ పడుతున్నాయి. ఈ మేరకు టోర్నీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్లకు ట్రాక్ షూలు, బ్యాట్లు అందజేశారు.

బీమా పరిహారం అందజేత



నామినీలకు బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ అధికారులు

దాబాగార్డెన్స్: ప్రమాదవశాత్తు మరణించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) ఖాతాదారులకు ఆ బ్యాంక్ ప్రతినిధులు సోమవారం ఇన్సూరెన్స్ బీమా అందజేశారు. కైలాసపురం, హెచ్‌బీ కాలనీ శాఖలకు చెందిన పాలసీదారులు(బీమా చెల్లించినవారు) టి.ఉమ, పి.రామకృష్ణకి సంబంధించి రూ.10 లక్షల క్లైమ్‌ను వారి మరణానంతరం నామినీలు టి.సాయి, పి.హరీష్‌కు ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆంధ్రా జీఎం శ్రీరామ సోమయాజి, ఆర్‌ఎం ఎస్.సతీష్‌చంద్ర, నోడల్ ఆఫీసర్ ఆకుల శివకుమార్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ క్లస్టర్ సేల్స్ మేనేజర్ జి.సురేష్‌బాబు, బీడీఎం జె.సోమేశ్వరరావు, పలువురు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యవనం సందర్శన



ఉద్యానవనంలో కృష్ణా వర్సిటీ విద్యార్థులు


ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు ఆర్‌సీడీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవవైవిధ్య ఉద్యానవనాన్ని మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఎమ్మెస్సీ వృక్ష శాస్త్రం అభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు జీవ వైవిధ్య వనాన్ని సందర్శించి ప్రత్యేకతలు తెలుసుకున్నారు. విద్యార్థుల వెంట అధ్యాపకులు డాక్టర్ మాధురీ, డాక్టర్ కృష్ణ కూడా పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్‌లోని మొక్కలు ప్రత్యేకతలను నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు.

సబ్సిడీ టమాటాకు డిమాండ్

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం వినియోగదారులు బారులు తీరారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధార్, రేషన్ కార్డు చూపించిన వారికి కిలో టమాటా రూ.50కు విక్రయించారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, సిబ్బంది పర్యవేక్షించారు.



12వ వార్డు చినగదిలి నుంచి పార్వతీనగర్ గెడ్డ వరకు నిర్మించి కొత్త రోడ్డు



13వ వార్డు పాండురంగాపురంలో ..

కొత్త రోడ్లతో కళకళ..

- ఆరిలోవలో రహదారుల నిర్మాణం
- స్థానికుల హర్షం



11వ వార్డు ముస్తఫాకాలనీలో వేసిన తారు రోడ్డు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం కొత్త రోడ్లతో కళకళలాడుతోంది. ఈ ప్రాంతంలో రహదారుల నిర్మాణంపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. కొన్నిచోట్ల శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, మరి కొన్ని చోట్ల కొత్తగా రోడ్లు నిర్మించడం చేస్తున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో వార్డుల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు నిర్మిస్తున్నారు. రహదారుల సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 10, 11, 12, 13 వార్డుల్లో పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి.

- పదో వార్డులో ఇటీవల రవీంద్రనగర్, ఎస్.ఐ.జి. నగర్‌లలో సీసీ రోడ్లు నిర్మించారు.
- 11 వార్డు పరిధి గాంధీనగర్, శ్రీహరినగర్, బాలాజీనగర్, ముస్తఫా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అంబేడ్కర్ నగర్, పార్వతినగర్, టీఐసీ పాయింట్ తదితర ప్రాంతాలలో కొన్నిచోట్ల తారు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని చోట్ల నిర్మాణం జరుగుతున్నాయి.
- 12వ వార్డు పరిధి బీఆర్‌టీఎస్ రోడ్డులో చినగదిలి కూడలి నుంచి సూర్యతేజా నగర్ మీదుగా 11వ వార్డు పరిధి పార్వతినగర్ గెడ్డ వరకు కొత్త రోడ్డును రూ 2.35 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్నారు. ఇక్కడ ఇరుకుగా ఉన్న 20 అడుగుల రోడ్డును విస్తరించి 80 నుంచి 60 అడుగుల (ఈ రోడ్డులో వీలును బట్టి కొన్నిచోట్ల 80 అడుగులు, మరికొన్నిచోట్ల 60 అడుగులు) వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మించారు. ఇందులో భాగంగా ఇక్కడ గెడ్డపై బ్రిడ్జి విస్తరణకు సిద్ధమయ్యారు. దీనికోసం గెడ్డను ఆనుకొని కొన్ని నివాసాలను ఇటీవల తొలగించారు. ఈ వార్డులో మరికొన్నిచోట్ల రోడ్ల నిర్మాణం పనులు జరగనున్నాయి.
- 13వ వార్డు పాండురంగాపురం, దుర్గాబజార్లలో ఇటీవల తారు రోడ్లు నిర్మించారు. వీటితో పాటు పైనాపిల్ కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టారు. ఇంకా మరికొన్ని చోట్ల పనులు జరగనున్నాయి.

రోడ్లు బాగున్నాయి

సుమారు నెల రోజులుగా గాంధీనగర్‌లో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ రోడ్లు బాగా పాడయ్యాయి. ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకటకుమారి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు తొందరగా జరిపిస్తున్నారు. మా ప్రాంతంలో రోడ్లు నిర్మిస్తున్న మేయర్‌కు కృతజ్ఞతలు.

– బి.శ్రీనివాసరావు, స్థానికుడు, గాంధీనగర్, 11వ వార్డు

సమస్య తీరింది

ఆరిలోవలో చాలాచోట్ల పాడైన రోడ్లు నిర్మించారు. గతంలో వీధుల్లో నడవలేకపోయేవాళ్లం. ఇప్పుడు తారు రోడ్లు వేయడంతో సమస్య తీరింది. అన్ని వీధుల్లో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. వీధుల్లో రోడ్లు బాగుండటంతో రోజూ ఇళ్ల ముందు శుభ్రం చేసుకోగలుగుతున్నాం.

– పి.పార్వతి, పాండురంగాపురం, 13వ వార్డు

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆమె తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

'వీధి వ్యాపారులకు అండగా వైఎస్సార్‌సీపీ'



17వ వార్డులోని వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న నాగరాజు

ఎంవీపీ కాలనీ: వీధి వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిత్యం అండగా ఉంటుందని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, 17 వార్డు సీనియర్ నాయకుడు గేదెల నాగరాజు అన్నారు. సోమవారం 17వ వార్డులో వీధి వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాయకుల పేరు చెప్పి ఎవరైనా వసూళ్లకు పాల్పడితే తనకు తెలియజేయాలని, తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని చోట్ల జీవీఎంసీ చేపడుతున్న రోడ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి కారణంగా నష్టపోయే పరిస్థితి ఉన్న వీధి వ్యాపారులను తప్పనిసరిగా ఆదుకుంటామన్నారు. వారికి వేరే చోట వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో వార్డు అభివృద్ధి కార్యక్రమాలకు ఎవరూ అడ్డుపడొద్దని సూచించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



23వ వార్డు రజక వీధిలో సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ విజయసాయి



16వ వార్డులో పోషణ కిట్లు అందిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 23వ వార్డులో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సోమవారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు గుడ్ల విజయసాయి అందజేశారు. మద్దిలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి నేడూ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశానికి మంగళవారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. సోమవారంతో గడువు ముగిసిపోయినప్పటికీ ఒక రోజు గడువు పొడిగించామని పేర్కొన్నారు. విద్యార్థులు సీటు అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు అన్ని సర్టిఫికెట్లతో మంగళవారం హాజరు కావచ్చునని తెలిపారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: సంఘ సంస్కర్త బిందేశ్వరి ప్రసాద్ మండల్(బీపీ మండల్)కు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు, పూర్వ విద్యార్థులు ఘన నివాళులర్పించారు. మండల్ కమిషన్ నివేదికను 1990 ఆగస్టు 7న పార్లమెంట్‌లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ ప్రవేశపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మండల్ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రేమానందం, ఆచార్య వీర్రాజు మాట్లాడుతూ దేశంలోని ఓబీసీలకు 22 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని మండల్ కమిషన్ నివేదించిందన్నారు. ఈ నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు కల్పించిన నేపథ్యంలో ఆగస్టు 7ను భారత సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. కేంద్రం బీసీ గణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, డాక్టర్ సుంకర రమణమూర్తి, డాక్టర్ హరీష్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ పట్నాయక్, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఆందోళనకారుల ముందస్తు అరెస్ట్

బీచ్ రోడ్డు: సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు దిగిన 60 మంది జీవీఎంసీ పారిశుధ్య కార్మికులను మూడో పట్టణ పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వైపు దూసుకువస్తున్న ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని నుంచి వివరాలు సేకరించి విడిచిపెట్టారు.

గాడి తప్పిన కృష్ణా జూనియర్ కళాశాల



కృష్ణా కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల రగడ

మద్దిలపాలెం : వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం చేసిన వీరంగంతో స్థానికులు హడలిపోయారు. ఒక్క క్షణం కృష్ణా కళాశాల రణరంగంగా మారిపోవడాన్ని చూసిన జనం గతంలో ఇలాంటి అల్లర్లు చూడలేదని, విద్యార్థులు గాడి తప్పిపోయారని కళాశాల యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అనకాపల్లి వృత్తి విద్యాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో కళాశాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరగతులు జరుగుతున్న సమయంలోనూ విద్యార్థులు మైదానంలో తిరుగుతుంటారని పలువురు చెబుతున్నారు. వీరి వ్యవహారశైలిపై జూనియర్ కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోవడమే ఇంత పెద్ద ఘర్షణకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే ఇంత జరిగినా ఘటనతో తమకు సంబంధం లేదని... కళాశాలలో ఏం జరగలేదని, విద్యార్థులు రోడ్డుపై కొట్టుకున్నారని కళాశాల ప్రతినిధులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు.

లైంగిక దాడి కేసులో రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24) కాకినాడ నివాసి. గతంలో ఒంగోలులోని ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేసేవాడు. తరువాత పాడేరు వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. డ్రైవర్‌గా పనిచేసేవాడు. బాధితురాలు(17) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం చుక్కల వీధి గ్రామ పరిధిలోని శివాలయం వీధిలో ఉండేది. హుకుంపేట మండలం గుత్తుల పాడు హైస్కూలులో పదో తరగతి చదివేది. తరచూ అదే ప్రాంతంలో ఉండే మహాలక్ష్మితో పరిచయం ఏర్పడింది. ఇది ప్రేమగా మారింది. దీంతో ఇద్దరూ 2021 జూన్ 2న పాడేరు బస్టాండ్ నుంచి చిలకలూరిపేటకు వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఉన్నారు. నిందితుడు మాయ మాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. అనంతరం వేరే ప్రాంతంలో వదిలి వెళ్లిపోయాడు. బాధితురాలు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాడేరు ఎస్‌ఐలు జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్పీ తుషార్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చారు.

ఏయూ సమాచారం..

'ప్రజల భాష తెలుగు'



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆచార్య అరుణ

ఏయూ క్యాంపస్: ప్రజలు ఆదరించి, పరిరక్షించిన భాష తెలుగు అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర శాఖాధ్యక్షురాలు ఆచార్య గంజి అరుణ అన్నారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులనుద్దేశించి ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష అంశంపై ప్రసంగించారు. గతంలో ఆంధ్రదేశాన్ని పాలించిన రాజులు అధికార భాషగా సంస్కృతాన్ని, ప్రాకృతాన్ని అమలు చేశారని, తెలుగును ప్రజలు ఆదరించడంతో నేటికీ మనుగడ సాగిస్తోందన్నారు. ప్రజల ఇష్టాన్ని తెలుసుకున్న రాజులు తరువాతి కాలంలో తెలుగులోనే రాజ్యపాలన చేశారని గుర్తుచేశారు. తరువాతి కాలంలో కావ్యాల్లో గ్రాంథిక భాష కొన్ని సంవత్సరాలు రాజ్యమేలిందని, పండిత భాషతో పాటు పామర భాషకు సైతం సమ ప్రాధాన్యత లభించిందని వివరించారు. తెలుగు భాషపై పాశ్చాత్య నాగరికతల ప్రభావం, ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో భాషలో అనేక అసమానతలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రాంతీయ వైవిధ్యతో అనేక మార్పులు చేర్పులు వచ్చాయని, భాష పరిణామం చెందుతున్న విధానం వివరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష పద సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఏయూలో ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు, ఉద్యోగులు

ఏయూ క్యాంపస్: ప్రజా గాయకుడు గద్దర్‌కు ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఉదయం ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అణచివేతపై తన గళంతో గర్జించిన గద్దర్ గేయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలిచిన గద్దర్ గళం ప్రజల మధ్యలో ఎప్పుడూ సజీవంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.అర్జున్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకట్, బాబ్జీ, థామస్, పుల్లారావు, సుధాకర్, వీర్రాజు, అరుణ్‌కుమార్, ప్రేమానందం, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని ముద్ర రుణాలు మంజూరు చేయాలి



కేఎస్ సుధాకరరావును సత్కరిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.130 కోట్లు ముద్ర రుణాలు మంజూరయ్యాయని సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ తెలిపారు. ఈ మేరకు రుణాలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కేఎస్ సుధాకరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ, అమరావతి, రాజమండ్రి జోన్లలో మరిన్ని ముద్ర రుణాలు స్వర్ణకారులకు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సుధాకరరావు స్పందిస్తూ ఇప్పటికే 23 పట్టణాల్లో ముద్ర రుణాల ప్రక్రియలు ప్రారంభించామని, భవిష్యత్తులో మరిన్ని పట్టణాల్లో ప్రారంభించి స్థానిక స్వర్ణకారు సంఘాలకు రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

నిరుద్యోగుల సమస్యలపై 11న రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న మర్రివేముల శ్రీనివాస్

ఎంవీపీ కాలనీ: ఈ నెల 11న నిరుద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రి వేముల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరముందన్నారు. ఉద్యోగ ప్రకటనలు, నిరుద్యోగల సమస్యలపై విద్యావేత్తలు, మేధావులతో ఈ నెల 11న పబ్లిక్ లైబ్రరీ వేదికగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు బొర్రా రమణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు కేఎస్ఆర్, తదితరులు పాల్గొన్నారు.

పొడి వ్యర్థ వనరులతో అద్భుతాలు



పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, విజయసాయి

మద్దిలపాలెం : పొడి వ్యర్థ వనరులతో అద్భుతాలు సృష్టించవచ్చునని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 23వ వార్డులోని డంపింగ్ యార్డు వద్ద పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రాన్ని ఆమె సోమవారం స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు గుడ్ల విజయసాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పొడి వ్యర్థ వనరులు సేకరించి వాటితో చక్కని అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



చేనేత దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ భారతీయ సామాజిక ఆర్థిక ప్రగతి చేనేత రంగం ఎంతో కీలకమన్నారు. చేనేత రంగాన్ని అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, శ్యామూల్ డేవిడ్‌రాజ్, రూపారాణి, కుసుమకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.